

సీఎంఆర్ ధాన్యం మాయం



- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో బయటపడుతున్న నిజాలు...
- ప్రభుత్వానికి పెద్ద ఎత్తున బాకీ ఉన్న మిల్లర్లు

హుజూరాబాద్/జమ్మికుంట రూరల్, జూలై 1: హుజూరాబాద్ డివిజన్‌లో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం పెద్ద మొత్తంలో మాయమైంది. రాష్ట్ర ప్రభుత్వానికి బియ్యం పట్టించి ఇవ్వాల్సిన మిల్లర్లు ఆ ధాన్యాన్నే ఎక్కదారి పట్టించారు. ఎప్పటికప్పుడు మిల్లులను తనిఖీలు చేయాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. వారం రోజులుగా హుజూరాబాద్ డివిజన్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు జరుగుతున్నాయి. ఈ తని ఖీల్లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లలో మిల్లర్లు బాకీ ఉన్న నిమ్మకు నిరేత్తనట్లుగా వ్యవ హరిస్తున్నారు. డివిజన్‌లో సుమారు 400 లారీల ధాన్యం మిల్లుల్లో లెక్కలు లేకుండా పోయాయని అధికారుల తనిఖీల్లో తెలిసింది. హుజూరాబాద్ డివిజన్‌లో ఏ మిల్లుల్లో చూసిన ఇదే పరిస్థితి నెలకొంది. విజిలెన్స్ అధి కారులు తనిఖీలు చేస్తున్నారని తెలుసుకున్న కొంత మంది మిల్లర్లు మిల్లులకు తాళాలు వేసి పరారీలో ఉన్నట్లు తెలిసింది.

● ప్రభుత్వ ధాన్యం పక్కదారి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రైతుల నుంచి ధా న్యాన్ని ఐకేపీ, డీసీఎంఎస్, సింగిల్ విండోల ద్వారా కొనుగోలు చేస్తుంది. ఈ ధాన్యాన్ని మిల్లర్లకు సీఎంఆర్ కింద అందజేస్తుంది. 2022-23 సంవత్సరంలో ధా న్యాన్ని వివిధ సంఘాల ద్వారా కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించింది. మిల్లర్లు ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అందజేయాల్సి ఉంటుంది. డివిజన్‌లో శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట, సైదాపూర్, ఇల్లందకుంట, వీణ వంక మండలాల్లో 40 మిల్లుల వరకు ఉన్నాయి. మిల్లు కెపాసిటీని బట్టి ధాన్యాన్ని కేటాయిస్తారు. కొంత మంది మిల్లర్లు ఐదు టన్నుల కెపాసిటీ ఉన్నా దాన్ని ఫోర్జరీ చేసి 10 నుంచి 15 టన్నులు ఉన్నట్లు సివిల్ సప్లయా అధికారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. దీనికి తగ్గట్టుగా ఒకొక్క రారైస్ మిల్లుకు సుమారు 200 నుంచి 300 లారీల వరకు, పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు 500 నుంచి 600 లారీల వరకు ధాన్యాన్ని కేటాయించారు. క్వింటాల్ ధాన్యా నికి 65 కిలోల బియ్యాన్ని రైస్‌మిల్లర్లు ఎఫ్‌సీఐకి అందజేయాలి. కొంత మంది మిల్లర్లు ధాన్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ధాన్యం ఉందా లేదా అని ఎప్పటి కప్పుడు సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లర్ల వద్ద వసూళ్లకు అలవాటు పడి అటు వైపు వెళ్లలేదు. దీంతో మిల్లర్లు ధాన్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఇటీవల మిల్లుల్లో ధాన్యం లేదని తెలుసుకున్న ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ అధికారులను ఏర్పాటు చేయగా, సదరు అధికారులు మిల్లులను తనిఖీ చేయగా మిల్లుల్లో ధాన్యం లేకపోవడంతో అవాక్కయ్యారు. కొంత మంది మిల్లర్లపై కేసులు నమోదు చేస్తున్నారు.

● టాస్క్‌ఫోర్స్ దాడులతో వెలుగులోకి..

జమ్మికుంట మండలంలోని ఓ మిల్లర్ ప్రభుత్వ ధాన్యంతో దందా సాగించాడు. లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని పక్కదారి పట్టించి కోట్లాది రూపాయాలు కొల్లగొట్టాడు. సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులతో సమిల్లరు బాగోతం వెలుగు చూసింది. జమ్మికుంట మండలం కోరపల్లి శివారులోని మహాశక్తి రైస్ మిల్లు, ఇల్లందకుంట మండలంలోని సీతారామ ఇండస్ట్రీస్‌లో నాలుగు రోజుల క్రితం సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించింది. 2022 నుంచి 2024 వరకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని జమ్మికుంటలోని మహాశక్తి మిల్లుకు 1.96 లక్షల క్వింటాళ్లు, ఇల్లందకుంటలోని సీతారామ ఇండస్ట్రీస్‌కు 1.19లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం అప్పగించారు. ఈ రెండు మిల్లులను కరీంనగర్‌కు చెందిన ఒక వ్యక్తి కొన్నాళ్లుగా లీజ్‌కు తీసుకొని నడిపించాడు. ధాన్యాన్ని మరాడించి బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సిన మిల్లరు ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఒకే వ్యక్తి మూడు లక్షల క్వింటాళ్ల ప్రభుత్వ బియ్యాన్ని దర్జాగా స్వాహా చేయడంతో అధికారులు కంగు తిన్నారు.

● యాజమానులపై కేసు

జమ్మికుంట, ఇల్లందకుంట మండలంలోని రెండు మిల్లులు కరీంనగర్‌కు చెందిన బండారి మారుతి-శారద దంపతుల పేరిట నడుస్తున్నాయి. సివిల్ సప్లయిస్ అధికారుల ఫిర్యాదుతో దంపతులు ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్వాహా అయిన మూడు లక్షల క్వింటాళ్ల ధాన్యం విలువ సుమారు రూ. 120 కోట్లు ఉంటుంది. కేసుల పేరుతో ఎప్పటిలాగే అధికారులు కాలయాపన చేస్తారా, సకాలంలో ధాన్యం రికవరీ చేస్తారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మిల్లు యాజమానులు కాస్త గడువు ఇస్తే ధాన్యం తిరిగి అప్పగిస్తానని ఒప్పుకున్నట్లు తెలుస్తుంది.



ఇల్లందకుంట మిల్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)

● మిల్లర్లతో మిలాఖత్ అయిన అధికారులు...

రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించే విషయంలో సివిల్ సప్ల యిస్ అధికారులు మిలాఖత్ అయినట్లు తెలిసింది. వ్యాపారుల గత చరిత్ర చూడకుండానే పెద్దఎత్తున వారికి ధాన్యం కేటాయిం చారు. వ్యాపారులతో సివిల్ సప్లయిస్ అధికారులు కుమ్మక్కై కెపాసిటీ లేని మిల్లులకు ఎక్కువగా ధాన్యం కేటాయించారనే విమర్శలు వినిపిస్తు న్నాయి. వ్యాపారులు ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇతర రాష్ట్రాలకు అమ్ముకు న్నట్లు తెలిసింది. సీఎంఆర్ పాల సీలో ఉన్న లోసుగులను ఆసరాగా చేసుకొని మిల్లర్లు రాజకీయ నాయకులతో సిఫారసులు పెద్దఎత్తున ధాన్యాన్ని కేటాయించు కున్నారు. ప్రభుత్వానికి నామ మాత్రంగా మిల్లర్లు బియ్యం పెట్టి చేతులు దులుపుకుని ధాన్యాన్ని మాయం చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మిల్లులపై దాడులు చేస్తుండడంతో వ్యాపారులు పరారీలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిల్లుల కెపాసిటిని బట్టి ధాన్యాన్ని కేటా యించడంతో పాటు ఎప్పటికప్పుడు మిల్లులపై సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు చేస్తేనే ధాన్యంమాయం కాకుండా ఉంటుందని పలువురు అంటున్నారు.

● పక్క రాష్ట్రాలకు ధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం క్వింటాల్ ధాన్యం ఇస్తే, మిల్లర్లు మరాడించి 67కిలోల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి లెవీ రూపంలో పెట్టాల్సి ఉంటుంది. ఆరు నెలల వ్యవదిలో సీఎంఆర్ బియ్యం అప్పగించాల్సి ఉంటుంది. కాని మిల్లర్లు బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రేడ్ ఎ రకం ధాన్యం 2,150, సన్నరకం ధాన్యం 2,800, దొడ్డు రకం బియ్యం 2,700, సన్నరకం బియ్యం 3,500 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిసింది.

రైస్ మిల్లులో తనిఖీలు



జమ్మికుంట మిల్లులో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

జమ్మికుంట: పట్టణ శివారులోని సప్తగిరి రైస్ మిల్లులో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం సోమవారం తనిఖీలు చేపట్టింది. కస్టమ్ మిల్లింగ్ కోసం ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో వ్యత్యాసాన్ని గుర్తించారు. ధాన్యం ఏమైంది, ఎక్కడికి తరలించారు అనే విషయమై ఆరా తీశారు. కొన్ని కారణాల వల్ల సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించలేక పోయానని, సెప్టెంబరు వరకు అప్పగిస్తానని మిల్లు యాజమాని లిఖిత పూర్వకంగా రాసి అధికారులకు అందజేశాడు. తనిఖీల్లో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ వి హాతీరామ్, తహసీల్దార్ విజయ, పట్టణ సీఐ వరంగంటి రవి, డీటీసీఎస్ వసంతరావు, సీఎస్ఐ వినోద్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ టీమ్ మెంబర్ అనిల్ పాల్గొన్నారు.

నేడు జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం

- మంత్రి 'పొన్నం'ను ఆహ్వానించిన చైర్‌పర్సన్
- 5న జడ్పీటీసీలు, 4న ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం ముగింపు

కరీంనగర్ టౌన్, జూలై 1: జిల్లా ప్రజాపరిషత్ చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని జడ్పీ చైర్‌పర్సన్ విజయ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించారు. ఈనెల 5న జడ్పీటీసీల పదవీ కాలం ముగియనున్నది. 4న ఎంపీపీలు, ఎంపీటీసీల పదవీ కాలం కూడా ముగియనుండడంతో ఇదే చిట్టచివరి, వీడ్కోలు సమా వేశం అవుతుంది. రెండేళ్లుగా జడ్పీకి ఎలాంటి నిధులు కేటాయించక పోవడంతో జడ్పీటీసీలు, ఎంపీపీలు గైర్హాజరవుతున్నారు. దీంతో కోరం లేక సమావేశాలు వాయిదా వేస్తూ వస్తున్నారు. మూడు నెలలకొకసారి విధిగా సర్వసభ్య సమావేశాలు, జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలను నిర్వహించాలనే నిబంధనలతో సమావేశాలు ఏర్పాటు చేసినా అవి సభ్యు లు లేక నామమాత్ర చర్చతో ముమ అనిపించారు. నిధులు, విధులు లేవని, ప్రజలకిచ్చిన హామీలను నెర వేర్చుకోలేని పరిస్థితిలో ఉన్నామని సభ్యులు పలుసార్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలకు సభ్యులు సరిగా హాజరుకాలేదు. దీంతో సమావేశాలు మొక్కుబడిగా జరి గాయి. ఈనెల 5న పదవీ కాలం ముగియనుండగా చిట్టచివరి సమావేశానికి సీఈవో ఏర్పాట్లు చేసి హాజరుకావాలని సభ్యులను కోరారు. ఈ సమావేశానికి కూడా సభ్యులు హాజర వుతారో లేక నామమాత్రపు చర్చతో ముగిస్తారో వేచిచూడాలి. మరోవైపు నిధులు, విధులు లేక తమను ఐదేళ్లుగా ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చారని జడ్పీటీసీలు, ఎంపీపీలు తీవ్ర అంసతృప్తిని వ్యక్తంచేస్తున్నారు.

● పదవి సంతృప్తికరం.. పనులు చేయడంలో అసంతృప్తి

- జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలందించే జడ్పీ చైర్‌పర్సన్ పదవి నాకు లభించడం సంతృప్తినిచ్చింది. చైర్‌పర్సన్‌గా నాకు, జడ్పీ టీసీలు, ఎంపీపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతరప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వం అందించిన సహకారం మరువలేను. ఐదేళ్లలో ఆశించిన మేరకు ప్రజలకు సేవ చేయలేక పోయాము. జడ్పీ వ్యవసనుఉ నిధులు, విధులు లేక పూర్తిగా నిర్వీర్యంగా మార్చారు. దీంతో సభ్యులు సమావేశాలకు గైర్హాజరు కావడంతో మొక్కుబడి సమావేశాలు నిర్వహించడం బాధ కలిగించింది. జడ్పీలకు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిస్తే బాగుంటుంది. ఐదేళ్ల పదవీకాలంలో సహకరించిన పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, జూలై 1: ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇస్తూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీం నగర్‌లో నిర్వహించే ప్రజా వాణి కార్య క్రమంలోని దరఖాస్తులే కాకుండా, హైదరా బాద్‌లో నిర్వహించే ప్రజాదర్బార్ దరఖా స్తులను పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. ప్రజా వాణికి 370 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖా స్తులను తహసీల్దార్లు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిం చాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. తహ సీల్దార్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్క రిం చా లని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వంద శాతం పూర్తి చేయాలన్నారు.

మేయర్ బీఆర్‌ఎస్‌కు దూరమవుతున్నారా?

- కేటీఆర్‌కు స్వాగతం పలకని సునీల్‌రావు
- పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కేటీఆర్ జిల్లాకు వస్తే స్వాగత కార్యక్రమాలకు హాజరుకాకుండా మేయర్ సునీల్‌రావు ఎందుకు దూరంగా ఉన్నారు.. ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ఆందోళనల్లో ఆయన ఎందుకు పాలుపంచుకోలేదు.. పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నారా.. అందుకే బండి సంజ య్‌ను ప్రశంసిస్తున్నారా... అని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. సోమవారం పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావు బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడానికి కరీంనగర్ మీదుగా వెళ్లారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మానికి నగర మేయర్ సునీల్‌రావు హాజరు కాకుండా



పోవ డంతో పార్టీశ్రేణులు ఆశ్చ ర్యానికి లోన య్యారు. ఇటీవల బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా సునీల్‌రావు ఆయన వద్దకు వెళ్లి అభినందించారు. స్మార్ట్ సిటీ కోసం ఆయన కృ షిని కొనియాడారు. ఐదేళ్లుగా బండి సంజయ్ కుమార్ నియోజక వర్గానికి, జిల్లాకు చేసిందేమీ లేదని సునీల్‌రావు విమర్శిం చారు. ఆయన ఒక్కసారిగా ప్లేట్ ఫిరాయించి స్మార్ట్‌సిటీని తెచ్చి అభివృద్ధి చేసిన వ్యక్తిగా సంజయ్‌ని పేర్కొనడంతో పాటు స్మార్ట్‌సిటీ నిధుల వినియోగానికి మరో సంవత్సరం గడువు పొడగించిన సందర్భంలోనూ సంజయ్‌ని ప్రశం సించడం బీఆర్‌ఎస్ వర్గాల్లో కలకలం రేపింది. ఆయన బీజేపీలో చేరేందుకే ప్రయత్నిస్తున్నా రంటూ పార్టీవర్గాల్లో చర్చ సాగుతోంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్‌ఎస్‌కే చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోప ణలు చేయడం జిల్లా రాజకీయాల్లో కలకలం రేపింది. అనంతరం జరిగిన పరిణామాలతో పోలీసులు బీఆర్‌ఎస్ నేతలను హౌస్‌అరెస్టు చేసి ఇరువర్గాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలకు మేయర్ సునీల్ రావు హాజరుకాలేదు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిసి అభినందించిన తర్వాత చాలా మంది కార్పొరేటర్లు, మేయర్ సునీల్‌రావు బీజే పీలో కలుస్తున్నారు.. మరి కొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాంగ్రెస్‌లో చేరుతున్నా రంటూ ప్రచారం జరిగింది. దదీంతో ఎమ్మెల్యే కమలాకర్ మేయర్‌ను, కార్పొరేటర్లను, ఇతర ముఖ్యనేతలను తీసుకొని ఫామ్‌హౌస్‌కు వెళ్లి బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులను కలిసి పార్టీ మార్పిడి చర్చకు తెర దించారు. అంతా సద్దుమణిగిందని అందరూ అనుకు న్నారు. సోమవారం కేటీఆర్‌కు స్వాగతం చెప్పేందుకు మేయర్ రాకపోవడంతో పార్టీ మార్పిడి అంశం మళ్లీ తెరపైకి తెచ్చింది.

పెండింగ్ పనులు పూర్తయ్యేనా?

- స్మార్ట్‌సిటీ మిషన్ గడువు తొమ్మిది నెలల పొడిగింపు
- ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తి

కరీంనగర్ టౌన్, జూలై 1: స్మార్ట్‌సిటీ పనులను పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశమిచ్చింది. జూన్ 30తో స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పూర్తికాగా మార్చి, 2025 వరకు గడువును పొడగించింది. 2017 జూలై 31న దేశంలోని 100 నగరాల్లో ఒకటిగా కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. స్మార్ట్‌సిటీకి ఎంపికైన అనేక నగరాల్లో ఇంకా పనులు పెండింగ్‌లో ఉండడంతో ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్మార్ట్‌సిటీ మిషన్ గడువును పొడిగించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

● 20 శాతం పనులు పెండింగ్

ఐదేళ్లలో పనులు పూర్తి కావలసి ఉండగా ఇప్పటి వరకు 80 శాతం పనులు మాత్రమే కరీంనగర్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో పూర్తి చేశారు. ఇంకా 20 శాతం పనులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో కొన్ని టెండర్ దశలో ఉన్నాయి. మరికొన్ని పనులు మధ్యలో ఉన్నాయి. 30 కోట్లతో చేపట్టాల్సిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (డంపుయార్డు) పనులు ఇంకా ప్రారంభించనే లేదు. ప్రభుత్వం అందుకు అవ సరవ్మైన స్థలం కేటాయించక పోవడంతో ఆ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా చేపట్టలేదు. 1,845 కోట్ల రూపాయలతో స్మార్ట్‌సిటీ మిషన్ కింద కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సమర్పించగా అందులో 936 కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. 2018 నుంచి ఇప్పటి వరకు జరిగిన 80 శాతం పనులకు సంబంధించి 745 కోట్లను సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లుల రూపంలో చెల్లించారు. 191 కోట్ల రూపాయలు విడుదల కావలసి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ నిధులు విడుదల కావలసి ఉంది. మందకొడిగా పనులు చేయడంతో అనేక పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగించడంతో ఇప్పటికైనా పనులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా కమాండ్ కంట్రోల్ భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, సెంట్రల్ లైబ్రరీ, మల్టీపర్పస్ పార్కు పనులతోపాటు 24/7 మంచినీటి సరఫరాకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నవి. వీటిలో కొన్ని పనులు ఇటీవలనే ప్రారంభించగా, మరికొన్ని పనులు 40 నుంచి 50 శాతం పూర్తయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన తొమ్మిది నెలల గడువులోగా పనులు పూర్తి చేస్తారా లేదోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శలు



ఇప్పటి వరకు చేపట్టిన స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందని, నాణ్యతా ప్రమాణాలను, నిబంధనలను పాటించలేదని అనేక ఫిర్యాదులు, విమర్శలు వచ్చాయి. కరీంనగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విచారణకు ఆదేశించడంతో అసంపూర్తి పనులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ వెసులుబాటులో పనులు పూర్తి చేస్తామని, అవకతవకలు, అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. గడువు పొడిగింపుపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన ఉపాధ్యాయ బదిలీలు

- బదిలీ ఉత్తర్వులతో కొత్త పాఠశాలలకు ఉపాధ్యాయులు

కరీంనగర్ టౌన్, జూలై 1: ఎట్టకేలకు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియ ముగిసింది. ఎప్పుడెప్పుడా అంటూ నిరీక్షిస్తున్న అర్హులైన పలువురు ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించగా, చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయు లకు బదిలీలు జరిగాయి. గత నెల 6 నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కాగా 20వ తేదీ వరకు ఈ ప్రక్రియను పూర్తిచేస్తామని విద్యాశాఖ ప్రకటించింది. భాషా పండితులు, పీఈటీలకు గత నెలలో పదోన్నతులతో పాటు బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీలు) బదిలీ ప్రక్రియపై పలు కారణాలతో ఆలస్యమైంది. వీటిపై ప్రత్యేక దృష్టి సారించిన విద్యాశాఖ అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో శనివారం దరఖాస్తు చేసుకొన్నారు. సీనియార్టీ జాబితాల వెల్లడిలో జాప్యం కావడంతో శనివారం రాత్రి 10 గంటల వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశమిచ్చారు. సర్వర్ల డౌన్ కారణంగా రాత్రంతా పడిగాపులు కాయాల్సిన పరి స్థితి ఏర్పడింది. ఆదివారం రాత్రి 12 గంటల వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. సోమవారం 448 మంది ఎస్జీటీ లను బదిలీ చేస్తూ ఆన్‌లైన్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు వెళ్లి వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరుతున్నారు. 21 మంది భాషాపండితులు, పీఈటీలకు సంబం, ధించిన ఉత్తర్వులు రాత్రి వరకు వెలువడక పోవడంతో వారు ఎదురు చూస్తున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు బదిలీ ఉత్తర్వులు వెలువడతాయని మంగళవారం కొత్త స్కూళ్లలో జాయిన్ కావాల్సి ఉంటుందని చెబుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎఫ్‌బీ కార్యకర్తలు

సుభాష్‌నగర్, జూలై 1: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెబుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, ఈ విషయమై అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేదన్నారు. తక్షణమే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురువెల్లి శంకర్, ప్రశాంత్ కుమార్, బేక్కంటి రమేశ్, బద్రి, కార్మిక సంఘ నాయకులు అరుణ్, కళావతి, శారద, సరళ పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్లపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 1: ముగ్గురు నకిలీ ఏజెంట్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన మొగిలి దేవదాస్ అతని స్నేహితుడైన కల్లెడ శ్రీకాంత్, చెర్లకొండపూర్ గ్రామానికి చెందిన అడప రాజేష్ ఉపాధి నిమిత్తం వేరే దేశం వెళ్లేందుకు కరీంనగర్ పట్టణానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఇండో అరబ్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలీ, విలాసాగర్ తిరుపతి, రహీంలను కలిశారు. సదరు వ్యక్తులు వీసా ఇప్పిస్తానని నమ్మబలికి యూరప్ దేశం లిథువేనియా పంపిస్తానని వారి వద్ద నుంచి పది లక్షల ఇరవై వేల రూపాయలు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చారు. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లిన బాధితులకు అక్కడ అధికారులు అవి నకిలీ వీసాలు అని తెల్పి చెప్పడంతో ఏజెంట్లు తమను మోసం చేశారని న్యాయం చేసి తమ డబ్బులు ఇప్పించాలని కోరుతూ మొగిలి దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహమ్మద్ అలీ, విలాసాగర్ తిరుపతి, రహీంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు-

జగిత్యాల టౌన్, జూలై 1: జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి త్రికూటాలయంలో 9వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారల కల్యాణ మహోత్సవ వేడులకను వేద పండితులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై కల్యాణ వేడుకలను నిర్వహించగా మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతితో పాటు భక్తులు హాజరై ఒడి బియ్యం సమర్పించి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దు

కరీంనగర్ టౌన్, జూలై1: ఆర్థికంగా ఎదిగిన ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ జాబితాలో చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి జిల్లా సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా రజక సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ 2008లో బీసీ ఏలో చేర్చవద్దని కోరుతూ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు తప్పుబట్టడంతో ముదిరాజ్‌లు సుప్రీం కోర్టును ఆశ్రయించారని అన్నారు. సుప్రీం కోర్టు కూడా తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ముత్యాల నర్సింహులు, వనపర్తి శంకర్, చాకలి అయిలమ్మ మనుమరాలు శ్వేత, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, కెఎల్ సుధాకర్, పైడి కొమురయ్య, వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎన్.గోపాల్, లీగల్ అడ్వయిజర్ లింగంపల్లి నాగరాజు, నెమలి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం



ఎస్‌యూలో మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్

గణేశ్‌నగర్, జూలై 1: శాతవాహన విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఎన్.రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బిఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ బి.ఎన్.రావు పాల్గొన్నారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మనోహర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ పాల్గొని విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. అలాగే అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా బీయన్‌రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కంచు తిరుపతి, అధ్యాపకులు డాక్టర్ మనోజ్ కుమార్, బండ నరేష్, డాక్టర్ బి పరుశురాములు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 1: కరీంనగర్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. రాత్రి 11 గంటల సమయంలో బ్యాంక్‌లో నుంచి దట్టమైన పొగలు బయటకు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తన సిబ్బంది, ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.



బ్యాంకు షట్టర్లు తెరుస్తున్న పోలీసులు

సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్య పెంచాలి

గణేశ్‌నగర్, జూలై 1: జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో సీట్ల సంఖ్యను పెంచాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నంద గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ హాస్టళ్లలో సరిపడా సీట్లు లేనందున అనేక మంది విద్యార్థులు ఇంటర్, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా యంత్రాంగం స్పందించి విద్యార్థులకు సరిపడా భవనాలను ఏర్పాటు చేసి సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను కలుపుకొని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కుమార్, తిరుపతి, మహేష్, గణేష్, నరేష్, నాతోపాటు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాటర్‌పోలో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు జరిగే 50వ జూనియర్ జాతీయ స్థాయి వాటర్‌పోలో పోటీలకు జిల్లాకు చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 23న సికింద్రాబాద్‌లో జరిగిన 9వ తెలంగాణ సబ్‌జూనియర్ అంతర్ జిల్లాలో స్విమ్మింగ్ పోటీల్లో విశేషప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు కంకణాల శ్రీధర్, హాశిక పటేల్‌లు విశేష ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్విమ్మింగ్ కోచ్ పి చంద్రశేఖర్ తెలిపారు. గతంలో కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయపోటీల్లో శ్రీధర్ పాల్గొని ప్రతిభ చాటాడని పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన శాఖ అధికారులు వి.శ్రీకాంత్ రెడ్డి, స్విమ్మింగ్ కోచ్ సంపత్‌కుమార్ తదితరులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో

కుటుంబ కలహాలతో బాలిక ఆత్మహత్యాయత్నం

చందుర్తి, జూలై 1: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీవాణి (15) 9వ తరగతి చదువుతున్న బాలిక కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం మొదట వేములవాడలోని ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం బాలిక తండ్రి లచ్చయ్య మృతి చెందాడు. సంఘటనపై విచారణ జరుగుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. సోమవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు



ప్రాజెక్టును సందర్శించిన ఎస్సారెస్పీ అధికారులు

వదిలారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేది నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబర్ 28వ తేది వరకు గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్ర పాణి, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సతీష్, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్సోడ్, పోచంపాడ్ ఏఈఈ వంశీ, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.



బాబ్లీ గేట్లు ఎత్తడంతో ఎస్సారెస్పీలోకి వస్తున్న వరద నీరు

స్కూల్‌కు వెళ్లేందుకు ఎలక్ట్రిక్ బైక్ ఇవ్వలేదని..

పురుగుల మందు తాగిన విద్యార్థి

చికిత్స పొందుతూ మృతి

కథలాపూర్, జూలై 14 : తాను ఎలక్ట్రిక్ బైక్‌పై స్కూల్ వెళ్తానని అడగడంతో తల్లి మందలించగా గడ్డి మందు తాగిన విద్యార్థి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన మండలంలోని పోసాని పేటలో జరిగింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... మారు మణిదీప్ (14) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదవుతున్నాడు. ప్రతీ రోజూ సైకిల్‌పై వెళ్లే మణిదీప్ గత నెల 26న ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ బైక్‌పై వెళ్తానని తల్లిని అడగగా అందుకు తల్లి నిరాకరించింది. దీంతో మనస్థాపానికి గురైన మణిదీప్ గడ్డి మందు తాగాడు. దీంతో కడుపు నొప్పిగా ఉందని ఇంట్లో వారికి చెప్పడంతో పరిస్థితి గమనించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ సోమవారం మణిదీప్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



మణిదీప్ (ఫైల్)

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, జూలై 1: చొప్పదండి పట్టణంలో చోరీ జరిగింది. గుర్రం చంద్రకళ తన ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి ఇంటిలోని బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులోని పద్నాలుగు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదుతో పాటు ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

రోడ్డు పక్కన షాపులు తొలగించిన సిబ్బంది

నిరసన తెలిపిన షాపుల నిర్వాహకులు



శంకరపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న షాపుల నిర్వాహకులు

శంకరపట్నం, జూలై 1: మండలంలోని తాడికల్‌లో రోడ్డు అక్రమించి ఉన్న షాపులను గ్రామపంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా తాడికల్‌లో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి స్థలంలో చిరు వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. రోడ్డును అనుకుని షాపులు ఏర్పాటు చేసుకోవడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించినా షాపులు తొలగించలేదు. సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది రహదారి స్థలంలో ఉన్న షాపులను తొలగించారు. దీంతో షాపు నిర్వాహకులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి సమ రాజేశ్వర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, జూలై 1: బీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. గతంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టులను బీసీ సంక్షేమ అధికారుల ద్వారా భర్తీ చేశారన్నారు. ఇప్పుడు కూడా అలాగే చేసి ప్రత్యేక బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీ కార్పొరేషన్‌ను యథావిధిగా కొనసాగించాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి టౌన్, జూలై 1: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘనటన సోమవారం పెద్దపల్లిలో జరిగింది. ముత్తారం మండల కేంద్రానికి చెందిన ఆకుల మొగిలి (45) కొద్ది రోజులుగా మద్యం సేవిస్తూ ఇంట్లో తరుచు గొడవకు దిగేవాడు. ఇదే క్రమంలో మద్యం మత్తులో ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మొగిళి తన సెల్ ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. సోమవారం కూనారం రైల్వేగేటు వద్ద తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు మొగిళి భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



మొగిలి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 1 : మండలంలోని కొత్తపల్లి నుంచి పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య చీకురాయి రైల్వే పట్టాలపై గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పాటు బ్లూ కలర్ షర్టు, నలుపు రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఏవైనా వివరాలు తెలిస్తే 9949304574, 8712658604 నంబర్‌కి కాల్ చేయాలని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 1: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చందనాపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై సనత్‌కుమార్ సిబ్బందితో కలసి తనిఖీ చేయగా ఓ ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,410 స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులపై ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ ప్రజావాణిలో సమస్యలు తక్షణమే పరిష్కారం

గణేశ్‌నగర్, జూలై 1: విద్యుత్ ప్రజావాణిలో వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. విద్యుత్తు వినియోగదారుల కోసం టీజీఎస్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఆయన వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ విద్యుత్తు ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఆఫీసు 3 దరఖాస్తులు, కరీంనగర్ టౌన్ 5 , కరీంనగర్ రూరల్ 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ విజయేందర్ రెడ్డి, ఏడీ స్వప్న, వీణ, తదితరులు పాల్గొన్నారు.

కోడెలు, ఆవులను ఉచితంగా పంపిణీ చేయాలి

● రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ● వేములవాడ గోవుల ఉచిత పంపిణీపై సమీక్ష



మాట్లాడుతున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ గోశాల నుంచి అదనపు కోడెలు, అవులు, ఉచిత పంపిణీకి అర్హు లైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నా రు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ దేవస్థానం గోవుల ఉచిత పంపిణీపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవస్థానానికి భక్తులు సమర్పించిన కోడెలు, ఆవులు అధికంగా పెరగ డం వల్ల అసక్తి గల అర్హులైన రైతులు ఆలయ గోశాలలు, ప్రైవేటు గోశాలలు, హిందూ మతాల వారికి అదనపు కోడెలు, అవులను ఉచితంగా పంపిణీ చేయడానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు రాని పక్షంలో రైతు సంఘాలు, సొసైటీలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. వేములవాడ దేవస్థానం ఈవోకు దరఖాస్తు చేసుకోవాల ని అన్నారు. వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

వేములవాడ దేవస్థానానికి సంవత్సరానికి 2,500 కోడెలు భక్తులు సమర్పిస్తారని దేవాలయం వద్ద 450 నుంచి 500 వరకు కోడెలు నిల్వ ఉంచుకుని మిగిలినవి వివిధ గోశాలకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. తిప్పాపురం గోశాలతో అదనపు షెడ్ల నిర్మాణం, సీసీ ఫ్లోరింగ్, డ్రైనేజీ నిర్మాణం, కోసం దేవాదాయ శాఖ రూ కోటి మంజూరు చేసిందని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అన్నారు. గోశాల నుంచి కోడెలు, ఆవులు పంపిణీ చేసిన తరువాత నిర్వహణ పకడ్బందీగా ఉండాలని జిల్లాలో అధికారులు అకస్మికంగా తనిఖీలు చేస్తారని తెలిపారు. పంపిణీ చేసే ప్రతి కోడె, అవులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య రిపోర్టులు లబ్ధిదారుడికి, దేవస్థానం, పశు సంవర్ధక శాఖ వద్ద ఉండాలని అన్నారు. పంపిణీ చేసిన పశువులను కూడా పశు సంవర్ధక శాఖ వైద్యులు పరిశీలించడం జరుగు తుందని కోడెలు, అవుల పట్ల నిర్లక్ష్యం వహించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో రాజేశ్వర్, ఈవో వినోద్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కోమురయ్య ఉన్నారు.

యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 1: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు అలయంలో సోమవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమ సూక్త పూర్వక అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కరీంనగర్ క్రై, జూలై 1: మానకొండూర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌లు కొత్తగా అమల్లో వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన శివరాత్రి కొమురయ్య తన ట్రాక్టర్ ద్వారా మానేరు వాగు నుంచి కరీంనగర్‌లోని ముకరంపురకు తరలిస్తున్న క్రమంలో టూ టౌన్ పోలీస్‌లు తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కొత్త చట్టం బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. కొత్త చట్టం ప్రకారం కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం పదికిపైగా కేసులు నమోదయినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

స్కానింగ్ సెంటర్లలో దోపిడీని అరికట్టాలి

సుభాష్‌నగర్, జూలై 1: జిల్లా కేంద్రంలోన ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు వసూలు చేస్తున్న అధిక ఫీజులను తగ్గించి దోపిడీని అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లిఅ యుగేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్ఎంపీ, పీఎంపీలతో పేరుతో పేషంట్ల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన వసతులు, పార్కింగ్ స్థలం, మంచినీటి సౌకర్యం, విశాలమైన గదులు వంటి సౌకర్యాలు కల్పించకుండా అధిక ఫీసులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

లోవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం

మల్యాల, జూలై 1: మల్యాల బీసీ కాలనీలో ఆదివారం రాత్రి లోవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం అయ్యాయి. కాలనీకి చెందిన పలువురి ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, విద్యుత్ లైట్లు తదితరవి కాలిపోయాయి. లోవోల్టేజీ సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



కుంకమ పూజలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి, జూలై, 1: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయం 14వ వార్షికోత్సలు ఘనంగా జరిగాయి. సోమవారం బంగారు పెద్దమ్మతల్లి ఆభరణాలను వీధుల గుండా ఎదుర్కోలుగా ఆలయానికి కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భక్తులతో కలిసి నెత్తిన ఎత్తుకొని తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలోని అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తు లకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం లో హోమం, కుంకుమ పూజలు జరిపించారు. అనంతరం భక్తులు ఆలయ సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవలన వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సార్గం వాడకట్టు సంఘం అధ్యక్షుడు జక్కం బాబు, మఠంవాడ సంఘం అధ్యక్షుడు యామ గణేష్, జక్కం రమేష్, పోచమ్మవాడ సంఘం అధ్యక్షుడు నేమూరి బాలకృష్ణ, జిట్టవేణి నర్సయ్య, రంజిత్, లక్ష్మయ్య, రాజయ్య, సంఘం సభ్యులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు వేల కోట్లకుపైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరి మామిడిపల్లి హెమంత్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

సుభాష్‌నగర్, జూలై 1: కురుమ కులస్తులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కురుమ సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్రె పావని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కురుమలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గం నుంచి బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కురుమ జనాబాకు ప్రతినిధిగా ఉన్న బీర్ల ఐలయ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు పెద్ది అనిత, పుల్ల రమ్య, సంద అంజలి, మేకల దేవిక, కర్రె సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చేందుకు అధికారుల యత్నం

అడ్డుకున్న నిర్మాణదారులు



పనులను అడ్డుకొని నిరసన తెలుపుతున్న దుస్స ఆంజనేయులు

కరీంనగర్ రూరల్, జూలై1: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో సర్వేనెంబర్ 471 పోచమ్మకుంట గుట్ట ప్రాంతం లో అక్రమ కట్టడాలను కూల్చేం దుకు ఆదివారం రెవెన్యూ అధికారు లు యత్నించగా ఇద్దరు అడ్డుకున్నా రు. కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ సర్వే నెంబర్‌లో వేముండ్ల వెంక టేష్ ఇటీవల ప్రహరీ నిర్మిస్తుండగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట ప్రహరీ కూల్చేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను వారు అడ్డుకున్నారు. సోమవారం ఆర్ఐ రజనీకాంత్ మోకాపై వెళ్లి పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీని ఎక్స్‌కావేటర్‌తో కూల్చి వేసేందుకు ప్రయత్నించగా వెంకటేష్ పురుగుల మందు డబ్బాతో వచ్చి అడ్డుకున్నాడు.

అలాగే మరో వ్యక్తి దుస్స అంజనేయులు ఎక్స్‌కావేటర్‌ని అడ్డగించి తమ ఇళ్లను కూల్చవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ స్థలంలోనే 20 నుంచి 30 సంవత్సరాలుగా ఆధీనంలో ఉంచుకున్నామని, గొర్రెల మందలను ఏర్పాటు చేసుకున్నామని వెంకటేష్ తెలిపాడు. కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని వాటికి కరెంటు మీటర్లు, నల్లలు ఏర్పాటు చేసినప్పటికి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ ప్రజాప్రతినిధి అండతో అక్రమ నిర్మాణాలు జరిపితే పట్టించుకోలేని అధికారులు తమ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేయడమేంటని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని తొలగించి తను నిర్మించిన ప్రహరీని కూల్చాలంటూ పురుగులమందు డబ్బాతో ఒకరు, జేసీబీని అడ్డుకుని మరొకరు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. చివరకు ప్రహరీ కూల్చివేత కార్యక్రమాన్ని నిలిపివేశారు. స్వచ్ఛందంగా ప్రహరీ తొలగించకుంటే వెంకటేష్‌పై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రజనీకాంత్ హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు జరిపితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

మద్దతు పలికిన బీజేపీ మండల అధ్యక్షుడు

అక్రమ నిర్మాణాల తొలగింపు విషయంలో బీజేపీ మండల అధ్యక్షుడు అభ్యంతరం వ్యక్తం చేశాడు. గుట్టకు అనుకుని ఉన్న భూములు బండరాళ్ళతో నిరుపయోగంగా ఉండేదని ఇల్లులేని పేదలు కొందరు భూమిని చదను చేసుకున్నారని, మరి కొందరు పశువులకు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా కబ్జాలో ఉన్న వారికి పట్టాలు, నివేశస్థలాలకు ప్రొసీడింగ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలోనే వారు 58,59జీవో దరఖాస్తు చేసుకున్నారన్నారు. తహసీల్దార్ వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 1: ప్రవర్తన సరిగా లేదని మార్చుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కరీంపేటకు చెందిన గుర్రం సాయిరాం (21) ప్రవర్తన బాగోలేదని, మార్చుకోవాలని తల్లిదండ్రులు గుర్రం భాగ్యలక్ష్మి- నాగరాజు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాయిరాం సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. సాయిరాం తండ్రి గుర్రం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.



సాయిరాం (ఫైల్)

వేములవాడలో ఒకరి ఆత్మహత్య

వేములవాడ టౌన్, జూలై 1: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ పరిసరాల్లో సోమవారం ఓ వ్యక్తి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన గూడూరి విష్ణు (36) అనే వ్యక్తి రాజన్న ఆలయ పరిసరాల్లో స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గతంలో నేత కార్మికుడగా, ఆటో డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగానే వుంటున్నాడని తెలిపారు. భార్యతో విడాకులు చేసుకుని ఒంటరి జీవితాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.



గూడూరి విష్ణు (ఫైల్)

రంగపేట పాఠశాలలో చోరీ

సారంగాపూర్, జూలై, 1 : మండలంలోని రంగపేట జడ్పీహెచ్ పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. హైస్కూల్, ప్రైమరీ, అంగన్‌వాడీ సెంటర్ ఒకే చోట నిర్వహించబడుతాయి. ఆదివారం రాత్రి దుండగులు చొరబడి అంగన్‌వాడీ సెంటర్ తలుపులు పగులగొట్టి కోడిగుడ్లను ధ్వంసం చేపడంతో పాటు, పాఠశాలలో ఉన్న హైమాస్ట్ లైట్లను ఎత్తుకెళ్లారు. స్థానికులు, ఉపాధ్యాయుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

డయాబెటిక్ పేషంట్లకు ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, జూలై 1: నగరంలోని సన్‌షైన్ ఆసుపత్రిలో ఈనెల 1 నుంచి 31 వరకు డయాబెటిక్(షుగర్) పేషంట్ల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. డయాబెటిక్ పేషంట్లందరికి పరగడుపున, భోజనానంతరం షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు డాక్టర్ శ్రీకాంత్‌చే ఉచిత కన్సల్టేషన్, సలహాలు సూచనలు అందచేస్తారు. అలాగే డాక్టర్ తాటిపాముల సురేష్ డయాబెటిక్ ఫుట్ కేర్‌కు సంబంధించిన సలహాలు సూచనలు అందచేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 1: నగరంలోని జ్యోతినగర్, వేంకటాద్రి కాలనీ మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. ఉదయం నిత్య పూజలు, హవనం, సూర్యప్రభవాహనసేవ, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం అగ్ని ప్రణయణం, కుంభారాధన, హోమం, నవసంధి బలి, ధ్వజా రోహణ, మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, వేదాశీర్వచనం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ భూదాతలు దేశబోయిన వంశ కుటుంబ సభ్యులు, ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు వేంకటేశ్వర్లు, వేదం, ఉపాధ్యక్షుడు గోపాలరావు, మురళి, అనంతరెడ్డి, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, పరంధాములు, మాజీ కార్పొరేటర్ దేశ శిల్పావేదం, ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ రూరల్, జూన్1: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఎంపీటీసీల పదవీ కాలం ఈనెల4న ముగియనుంది. మరో రెండు రోజుల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం ముగియనుండటంతో స్థానిక ఎన్నికల వరకు ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థతో పాటు, మంచినీళ్ళు, విద్యుత్, తదితర సమస్యలపై గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కరీంనగర్ రూరల్ మండలంలో 17గ్రామాలు ఉండగా ఒక్కొక్క గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించారు. నిధులు, విధుల విషయంలో ప్రత్యేకాధికారాలు కేటాయించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన పర్యటనలు, సమీక్షలకే పరిమితమవుతున్నాయి. గ్రామాల్లో పనిచేసే కార్యదర్శులు ఇటు గ్రామంలో నెలకొన్న సమస్యలే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే చేపట్టారు. మళ్ళీ ల్యాండ్ యుటిలైజెషన్ సర్వేను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించి గ్రామాల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కోతలను అరికట్టాలి

భగత్‌నగర్, జూలై1: కొత్తపల్లి పట్టణ కేంద్రంలో అప్రకటిత విద్యుత్ కోతలను ఆపాలని కరీంనగర్ ట్రాన్స్‌కో డీఈకి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో చినుకుపడితే చాలు కరెంటు కోతలు విధిస్తున్నారని, దీంతో నరకయాతన పడుతున్నామని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పొన్నం శ్రీకాంత్, బూస సాయికృష్ణ, కుతాటి శ్రీనివాస్, వీరేశం, పొన్నం శ్రీకాంత్, వడ్లూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్త గుండ వీరేశం మృతి

కరీంనగర్ కల్చరల్, జూలై1: ఆర్యవైశ్య ప్రముఖుడు, ఆధ్యాత్మికవేత్త, ఎస్ఆర్ఆర్‌కె ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం వేములవాడ సంయుక్త కార్యదర్శి గుండ వీరేశం (85) సోమవారం కరీంనగర్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయ్యప్ప గురు స్వామి గుండ రాధాకిషన్‌కు వీరేశం సోదరుడు. అవోపా జీవితకాల సభ్యునిగా, వాసవి వృద్ధాశ్రమం సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియన్ వ్యవస్థాపక కోశాధికారిగా పని చేశారు. తిరుపతి, షిరిడి, హరిద్వార్ ఆర్యవైశ్య సత్రాల సభ్యుడుగా ఉంటూ ఆర్యవైశ్య యాత్రీకులకు ఆయా సత్రాల్లో ఏర్పాట్లు చేయండంతో పాటు దాతలను చేర్పించడంలో కృషి చేశారు. వీరేశం మృతి పట్ల ఉప్పల రామేశం, కొండూరి సత్యనారాయణ, సముద్రాల జనార్దన్‌రావు, బుస్స శ్రీనివాస్, కొమురవెల్లి వేంకటేశం, పల్లెర్ల గోపాల్‌కిషన్, గంజి స్వరాజ్‌బాబు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

కరీంనగర్ రూరల్, జూలై1: మండలంలోని బొమ్మకల్ గ్రామ శివారులోని రజ్వీచమన్‌లో ఏడు నెలల క్రితం కంకర వేసి అర్ధాంతరంగా నిలిపివేసిన రోడ్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సోమవారం ప్రజావాణిలో కాలనీ వాసులు, సిటిజన్ కాలనీ వాసులు అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముజఫర్, అబ్దుల్ రజాక్, సయ్యద్ అఫ్జల్, మహమ్మద్ మాజీద్, అంజాద్ అలీ, అలీముద్దీన్, యూనుస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన గోదాంను తొలగించాలి

కరీంనగర్ రూరల్, జూలై1: మండలంలోని ఇరుకుల్ల గ్రామంలో సర్వే నెంబర్217లో అక్రమంగా నిర్మించిన గోదాంను తొలగించాలని కాంగ్రెస్ ఇరుకుల్ల గ్రామ అధ్యక్షుడు కాశిపాక రాకేష్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రెండేళ్ళ క్రితం గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సెట్ బ్యాక్ లేకుండా అక్రమంగా గోదాంను నిర్మించారని ఫిర్యాదులో కోరారు. దీనిపై గ్రామ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈగోదాం రహదారి వెంట ఉండటంతో గోదాంలో పండ్లు దిగుమతి కావడం దీంతో బారి వాహనాల రాకపోకలవల్ల అసౌకర్యాలకు గురవుతున్నామని, అలాగే పాడైన వ్యర్థపదార్థాలతో దోమల బెడద, దుర్వాసన, వాయు కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు.

సంగోజీపేట చెరువు మరమ్మతులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కోమటిరెడ్డి చంద్రకళ రాంగోపాల్‌రెడ్డి

చిగురుమామిడి,జూలై 1: ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్రం కృషి చేస్తోందని ఇందుర్తి-2 ఎంపీటీసీ కోమటిరెడ్డి చంద్రకళ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుర్తి- గాగిరెడ్డిపల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉన్న సంగోజీపేట చెరువు మరమ్మతు పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్ సంఘాల కోరిక మేరకు మత్తడి వద్ద వల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సన్నీల్ల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, అచ్చ రవీందర్, బొమ్మగాని మధుసూదన్, కంది శంకర్ పాల్గొన్నారు.

మండల సభకు రావాలని మంత్రికి ఆహ్వానం

చిగురుమామిడి,జూలై 1: మండల సర్వసభ్య సమావేశానికి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు సోమవారం హైదారాబాద్‌లో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మంత్రిని సన్మానించారు. అనంతరం ఎంపీపీని, ఎంపీటీసీ సభ్యులను మంత్రి సన్మానించారు. మండల సభకు తప్పకుండ వస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ మిట్టపల్లి మల్లేశం, ఎంపీటీసీ సభ్యులు అందె స్వప్న స్వామి, పెసరు జమున రాజేశం, మేడబోయిన తిరుపతి, ఏలేటి రవీందర్‌రెడ్డి, కొత్తూరి సంధ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



శ్రీరాములపల్లెలో మాట్లాడుతున్న రూరల్ సీఐ కిశోర్

ఇల్లందకుంట, జూలై 1: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో యువతకు డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిశోర్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం ఒకప్పుడు పట్టణాల్లో ఉండేదని, ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చిందన్నారు. దానిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మత్తు, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత బానిసలు కావొద్దని, చదువుపై పూర్తి ఏకాగ్రత సాధించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మి మోసపోవద్దని, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజకుమార్, ఏఎస్ఐ రవి, సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు



మాట్లాడుతున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూలై 1: నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. పారమిత పాఠశాలలో నగరంలోని వైద్యులు ఆకుల విద్యాసాగర్, డాక్టర్ రేఖాసాగర్, ఎస్‌బీఆర్ చంద్రమూర్తి, డాక్టర్ తులసీరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ శరత్ బంగారి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలకు హెల్త్ క్యాంపు నిర్వహించి, ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు ప్రథమ చికిత్స ఎలా చేయాలో వివరించారు. ఈకార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

●సిద్దార్థ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో డాక్టర్ల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●మానేరు విద్యాసంస్థల్లో చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునితారెడ్డి డాక్టర్ డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్ల వేషాధారణతో ఆకట్టుకున్నారు.

●జాన్సన్ కేరా పాఠశాలలో డాక్టర్స్ డేను పురస్కరించుకొని ప్రముఖ వైద్యులు రమణారెడ్డి, మంజుల, తిరుపతి, రమాణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలను కేరా, ఎస్‌వీజేసీ కళాశాల వక్షాన చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

●సుభాష్‌నగర్: జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శాతవాహన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానించారు. సోమవారం స్థానిక పవన్‌పద్మ ఆసుపత్రిలో క్లబ్ అధ్యక్షుడు చెన్నమనేని రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ పద్మప్రియ, డాక్టర్ ఎల్ రవికాంత్, డాక్టర్ డి గీతాంజలిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు సంగోజు మనోహరాచారి, మేచినేని సత్యనారాయణరావు, నడిపెల్లి ప్రసాద్‌రావు, మర్రిపెల్లి మహేందర్, కోశాధికారి పచ్చునూరి సురేందర్, కోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

●రాజరాజేశ్వర లయన్స్‌క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలోని వెల్‌నెస్ సెంటర్ వైద్యులు డాక్టర్ శరత్‌కుమార్, ప్రత్యూష, సాహితి, చిద్విల, ఆశిఫ్ జబీన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ ఎంవి రావు, ఉప గవర్నర్ కోదండరామ్, పటేల్ మల్లారెడ్డి, సంధి మోహన్‌రెడ్డి, లంబు రాజిరెడ్డి, రాళ్ళబండి గోపాల్‌రెడ్డి, సుధీర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సన్మానించారు. సోమవారం రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార కంటి ఆసుపత్రిలో డాక్టర్ పి శ్వేత, డాక్టర్ స్వాతి, డాక్టర్ హరిక, డాక్టర్ మైమున, డాక్టర్ మహవిష్, డాక్టర్ స్వాతిశ్రీలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ కొండ వేణుమూర్తి, ట్రస్ట్ వైస్ చైర్మన్ చిదుర సురేష్, కార్యదర్శి ప్రకాశ్ హోళ్ళ, సభ్యులు డాక్టర్ టి మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి, ముక్క శరత్‌కుమార్, కార్యదర్శి మ్యాడం శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్లో డాక్టర్స్‌డే, చార్టర్డ్ అకౌంట్స్‌డేను నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో డాక్టర్‌లు, చార్టెడ్ అకౌంటెంట్లు చేసే కృషి సమాజ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్యుల వేషాదారణలో ఆకట్టుకున్నారు.

●భగత్‌నగర్: కరీంనగర్‌లోని రేకుర్తి విద్యానగర్, తీగలగుట్టపల్లిలో గల సెయింట్ జార్జ్ న ఇనోస్ బ్లాక్ (సిబిఎస్ఈ) విద్యాసంస్థల్లో డాక్టర్స్‌డే నిర్వహించారు. విద్యార్థులు డాక్టర్ల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా.పి.పాతిమారెడ్డి మాట్లాడుతూ డాక్టర్స్ కృషి మరువలేనిదని కొనియాడారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, సంగీత, సంధ్య స్వప్న, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

●చొప్పదండి: చొప్పదండిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైద్యులను సన్మానించారు. ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే కార్యక్రమంలో వైద్యులను సన్మానించారు. చొప్పదండిలోని సిద్ధార్థ స్కూల్‌లో డాక్టర్స్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీపాల్ రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడం, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

●గంగాధర: గంగాధరలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్, పోస్టల్ వర్కర్స్ డేను ఘనంగా నిర్వహిచారు. పీహెచ్‌సీలో వైద్యులను, పోస్టల్ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, శ్రావణి, లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు శ్రీరాం శ్రవణ్, సభ్యులు సమ్మయ్య, రాములు, లక్ష్మారెడి పాల్గొన్నారు.

●హుజూరాబాద్: బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో పట్టణంలోని వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రావు, రమణారెడ్డి, వాణీలత, రామలింగారెడ్డి, స్వామి, నవీన్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, నాగలింగంను సన్మానించారు.

●హుజూరాబాద్ పట్టణంలో వాసవి వనిత క్వీన్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రచనను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ వైద్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గోలి హిమబిందు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

భగత్‌నగర్, జూలై 1: ప్రజా సమస్యలపై ఈనెల 8,9 తేదీలలో మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో గీట్ల ముకుందరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమాసాహెబ్, యు శ్రీనివాస్, ఎడ్ల రమేశ్, సుంకరి సంపత్, డి నరేష్ పాల్గొన్నారు.

పద్మశాలి పురోహిత సంఘం సమావేశం

కరీంనగర్ కల్చరల్, జూలై 1: నగరంలోని దేవుళ్ళపురి శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో సోమవారం పద్మశాలి పురోహిత సంఘం సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు రుద్ర పాండు శాస్త్రి హాజరై మాట్లాడుతూ ఈ నెల 24, 25, 26 తేదీల్లో కర్నూలు జిల్లా అహోబిలంలో జరిగే అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత మహాసభలకు పద్మ బ్రాహ్మణులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన పద్మశాలి కుల బాంధవులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దేవనపెల్లి రమేశ్, సభ్యులు దూస రాజమల్లయ్య, మచ్చ సత్యనారాయణ, మేరుగు శ్రీనివాస్, మార్కండేయ మాలాధారణల గురుస్వామి చిలుక నరసప్ప, చిలుక వినోద తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘనస్వాగతం



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జూలై 1: జగిత్యాలలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కరీంనగర్ మీదుగా వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావుకు పార్టీనేతలు స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో పాటు పలువురు నాయకులు అల్గునూర్ వద్ద కేటీఆర్‌కు పుష్పమొక్కను బహూకరించి ఘనంగా స్వాగతించారు. కరీంనగర్‌కు చేరుకున్న కేటీఆర్‌కు రాంపూర్‌లో నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పూలమొక్కను బహూకరించి శాలువతో సన్మానించి ఘనంగా స్వాగతించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, డివిజన్ అధ్యక్షుడు, ఇంచార్జిలు పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: అలుగునూర్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. జివి.రామకృష్ణారావు కేటిఆర్‌కు పూల మొక్క అందించారు. బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి కేటీఆర్‌కు చిత్రపటాన్ని అందజేశారు.

కేటీఆర్‌ను కలిసిన వారిలో 8వ డివిజన్ కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు రావుల రమేష్, ఆత్మ కమిటీ మాజి చైర్మన్ పాశం అశోక్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ స్వామి రెడ్డి, నాయకులు జావ శ్రీనివాస్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, పోతురాజు దేవేందర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మికుంట బస్టాండ్‌లో పార్కింగ్ తిప్పలు



జమ్మికుంట బస్టాండ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాలు

జమ్మికుంట, జూలై 1: జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ద్విచక్రవాహన దారులకు పార్కింగ్ తిప్పలు తప్పడం లేదు. బస్టాండ్‌లో తమ కుటీంభికులు, బంధువులు, స్నేహితులు, సన్నిహితులను దింపేందుకు అధిక శాతం మంది ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. ఆ సమయంలో ద్విచక్రవాహనాలను ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేయనివ్వడం లేదు. బస్టాండ్ బయట పార్కింగ్ చేద్దామనుకుంటే దుకాణ యాజమానులు ఒప్పుకోవడం లేదు. దీంతో వాహన దారులకు పార్కింగ్ సమస్య తలనొప్పిగా మారింది. బస్టాండ్‌లోని కంట్రోల్ రూం ఎదు వాహనాలను నిలుపున్నారు. దీంతో బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చే వచ్చే సమయంలో, రవర్స్ తీస్తున్న క్రమంలో ద్విచక్రవాహహనాలు అడ్డు వస్తున్నాయి. పలు సందర్భాల్లో బస్సుల వెనుక బాగం తగిలి దెబ్బతింటున్నాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాదికారులు స్పందించి వాహనాల పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

'జ్యోతిష్మతి'లో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న జువ్వాడి సాగర్‌రావు దంపతులు

తిమ్మాపూర్, జూలై 1: జ్యోతిష్మతి ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకం నిర్వహించారు. జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, జువ్వాడి విజయ, సెక్రెటరీ, కర స్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్ పీకే వైశాలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె కళ్లు సజీవం



స్వరూప (ఫైల్)

జమ్మికుంట, జూలై 1: పట్టణంలోని మోత్కులగూడెంకు చెందిన ముక్క స్వరూప (60) గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో ఆమె నేత్రాలు సేకరించి హైదారాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు.

నేడు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

హుజూరాబాద్ రూరల్, జూలై 1: హుజూరాబాద్ కేసీ క్యాంపులోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్ర వ్యవసాయ విధానం, దమ్ము చేయకుండా నేరుగా పత్తి, వరి సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు.

హుజూరాబాద్ ఎంఈవోగా శ్రీనివాస్‌రెడ్డి

హుజూరాబాద్, జూలై 1: హుజూరాబాద్ మండల విద్యాధికారిగా సైదాపూర్ మండలం దుద్దెనపల్లి జడ్పీహెచ్ఎస్ లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా విద్యాధికారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుజూరాబాద్, జమ్మికుంట మండలాల ఎంఈవోలుగా పనిచేసిన కేతిరి నర్సింహారెడ్డి, విడపు శ్రీనివాస్ బదిలీ చేశారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డిని డివిజన్‌లోని ఆరు మండలాలకు ఎంఈవోగా జిల్లా విద్యాధికారి నియమించారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట, జూలై 1: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ చేసిన ఓసీ, బీసీ అభ్యర్థులకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 5న సాయంత్రం నాలుగు గంటల్లోపు అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ రామ్మోహన్‌రావుకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత ఉద్యోగ శిక్షణ

హుజూరాబాద్, జూలై 1: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఉద్యోగ శిక్షణను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇందిరాదేవి మాట్లాడుతూ ఈ నెల 1నుంచి 8వరకు ఉచిత శిక్షణ కొనసాగుతుందన్నారు. హుజూరాబాద్ పరిసర ప్రాంతాల్లో డిగ్రీ పాసైన వారు ఈ కోచింగ్ తీసుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బయోడేటా ఫామ్‌తో కళాశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్ఎన్ మూర్తి, అధ్యాపకులు దినకర్, శ్రీనివాస్, పరమేష్, రాజకుమార్, హరిప్రసాద్, సమ్మయ్య, శ్యామలదేవి, స్వప్న, స్వరూప పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



గన్నేరువరం శివారులో నిల్వ చేసిన ఇసుక

గన్నేరువరం, జూలై 1: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పగలు రాత్రి తేడా లేకుండా అడ్డగోలుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. గన్నేరువరం శివారులోని పలుగురాళ్ల వద్ద అక్రమంగా ఇసుకను భారీగా డంపు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా డంపు చేసిన ఇసుకను రాత్రి వేళ ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై 1 : నగరంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. రాంచంద్రాపూర కాలనీ, సప్తగిరి కాలనీలో కొంతభాగం, రాంచంద్రాపూర్ కాలనీ, ఎటిఎస్ కాలనీల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు స్లాటర్ హౌస్‌కు బహిరంగ వేలం

కరీంనగర్ టౌన్, జూలై 1: నగరంలోని గొర్రెలు, మేకల వధశాల (స్లాటర్ హౌస్) నిర్వహణకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రపకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశమందిరంలో సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని, వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

సుభాష్‌నగర్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఈసీ స్కీం ఏఎన్ఎంలను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశం, రామనాథం కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లయ్య, రవికుమార్, ఈసీ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షుడిగా సురేష్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సురేష్

సుభాష్‌నగర్, జూలై 1: ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షునిగా రెడ్డి సురేష్‌ను నియమిస్తు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ నియమించారు. సోమవారం ఆయనకు నియమక పత్రాన్ని అందచేశారు.

ఉపాధ్యాయుల నిరసన

కరీంనగర్ టౌన్, జూలై 1: ఎస్‌జీటీ బదిలీల్లో పూర్తిస్థాయి ఖాళీలను చూపించ లేదని ఆరోపిస్తూ టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సోమవారం నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖాజా మంజూర్‌అలీ పాల్గొన్నారు.

జిల్లా పాస్టర్స్ ఫెల్లోషిప్ కార్యవర్గం

భగత్‌నగర్, జూలై 1: జిల్లా పాస్టర్స్ ఫెల్లోషిప్ నూతన కార్యవర్గ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రేకుర్తిలోని బేత్లేహేము చర్చిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి స్టీఫెన్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షునిగా తాళ్లపెల్లి జాషువ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎజ్రా మల్లేశం, ఉపాధ్య క్షునిగా కె.నతానియేల్, ప్రధాన కార్యదర్శిగా జాషువ, జాయింట్ సెక్రెటరీగా యు అహరోన్, కోశాధికారిగా కొంగర జోనా, కార్యవర్గ సభ్యు లుగా రాజ్‌కుమార్, జోగు దేవదాస్, గంగరాజును ఎన్నుకున్నారు.

స్మార్ట్‌సిటీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

కరీంనగర్ టౌన్, జూలై 1: నగరంలో స్మార్ట్‌సిటీ మిషన్ కింద చేపట్టిన పలు పనులు ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్నాయని, కేవలం పైన పటారం..లోన లొటారం అన్నట్లుగా పనులు చేపట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమాలకు పాల్పడ్డారని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. స్మార్ట్‌సిటీ పనుల అవినీతిపై మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడంతో విచారణకు ఆదేశించారన్నారు. దీంతో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఎంబీలను మాయం చేస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

బల్దియా సమావేశాన్ని ఏర్పాటు చేయండి

కరీంనగర్ టౌన్, జూలై1: బల్దియా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి వాటిని పరిష్కరించాలని కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహెన్‌సింగ్ కోరారు. ఈమేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం సమర్పించారు.

సంక్షిప్తంగా..

● శంకరపట్నం: మండలంలోని ఇప్పలపల్లిలో మొక్కలు నాటేందుకు ఎఫ్ఆర్వో రాజేశ్వర్‌రావు సోమవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సరిత, ఏపీవో శారద పాల్గొన్నారు.

- మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి సురేష్ ను ముదిరాజ్ మహాసభ యువత విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు.

● జమ్మికుంట రూరల్: పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంట రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ పొనగంటి సంపత్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, జిల్లా అధికారులు మనోజ్ కుమార్, శ్రీనివాస్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

● మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి సహకార సంఘంలో సోమవారం అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు అనభేరి రాధాకిషన్‌రావు సభాధ్యక్షత వహించారు.

● వీణవంక: మండలంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయానికి ఆవాల బుచ్చిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రెండు లక్షల రూపాయల విలువ చేసే వెండి ఆభరణాలు అందజేశారు.

- మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77 పదో తరగతి చదివిన విద్యార్థులు పది వేల విలువ చేసే సైన్స్ మెటీరియల్ ప్రధానోపాధ్యాయులు పులి అశోక్‌రెడ్డికి అందజేశారు.

● తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షరీఫ్ అహ్మద్ తమ పాఠశాలలోని గ్రంథాలయానికి ఐదు వేల రూపాయల విలువ గల పుస్తకాలను అందజేశారు.

● గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామ గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడిగా కనుకయ్య ఎన్నికయ్యారు.

● చిగురుమామిడి: మండల కేంద్రంలో ఈ నెల 3న అత్యవసర మహాజన సభ నిర్వహించనున్నట్లు వింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి తెలిపారు.

● హుజూరాబాద్: పట్టణానికి చెందిన నాగుల సత్యం గౌడ్‌కు జాతీయ స్థాయి జ్ఞాన బుద్ధ పూర్ణిమ పురస్కారానికి ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాల్లో భాగంగా వేములవాడకు చెందిన తెలుగు వెలుగు సాహితీ సంస్థ వేదిక, విశ్వకర్మ వేద పురోహిత పాఠశాల విరాట్ విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ ఆధ్వర్యంలో సత్యంగౌడ్‌కు అవార్డును బహూకరించారు.